# చంద్రోదయం ..

కొడవటిగంటి కుటుంబరావు

౧

కాంతారావిక లోపలఉండలేక బయటికొచ్చేశాడు. వావిలాలవారి పెరట్లో చెట్లమీదినించి చంద్రుడప్పుడే ఉదయిస్తున్నాడు. లోపల తన జీవితాన్ని రెండేళ్లపాటు వెలిగించిన మణిముఖచంద్రబింబం అస్తమించుతున్నది.

ఆ గదినిండా జనం కిటకిట లాడుతూ కూర్చున్నారు. డాక్టరు యమధర్మరాజు. మణిజీవితం నిమిషాల్లో ఉందని చెబుతూనే ఎవరైనా గట్టిగా ఊపిరి విడిస్తే కేసువదిలి బయటికి నడుస్తానన్నాడు. క్షణాల్లో ఉంది. తనమణి చివరసారి ఊపిరివిడిచేస్తుంది. వాళ్ల దుఃఖం ఉప్పెనల్లేవచ్చి పడుతుంది. దాంతో తనగుండెకూడా బద్దలైపోతుంది. తనుకూడా మణితోకలిసి వెళ్ళిపోవచ్చును.

మణి !

ఎక్కడా మంచివాళ్లు—ప్రేమించదగిన వాళ్లు లేరా? వాళ్లలో లోపాలుండవా? మణిలోకూడా ఒక్కలోపం, అలంకారార్థం ఉండరాదా? నాలుగైదేళ్లుకాలేదే తననోటి మీదిగా "మంచిగుణాలను ప్రేమించేదేమిటి? లోపాలనే ప్రేమించాలి!" అని. "మణీ! ఇంత అదృష్టం నాకెట్లా దొరికింది? నీవంటి దేవత నాకుపెళ్లాంకావటానికి నేనేంపుణ్యం చేసి ఉంటాను?" అని తను మణిని అడిగినప్పుడు మణి ఇట్లా అవుతుందని పాపం, ఎట్లా ఊహించగలదు?

అందరుపెళ్లాలంటి పెళ్లాం కాదే తన మణి! తల్లిపోయిన్నాటినించీ తన జీవితానికి మాతృత్వమన్నది లేక, అష్టకష్టాలూపడి తన హృదయం అలిసినప్పుడు దాన్ని సమదాయించి చల్లగా నిద్రపుచ్చేవాళ్లు లేక తనొక పద్మవ్యూహంలో చిక్కిపోయి, బోగం కొంపల్లో పడిఉండి, ఓడానని చెప్పటం ఇష్టం లేక, ప్రజ్ఞకు పెనుగులాడుతూ, లోకాన్ని యావత్తూ ఎదుర్కొని నానాయాతనలూ పడుతున్నప్పుడు మణి దేవతామూర్తిల్లేవచ్చి తన్ను నరకంలోనించి మెకామెకీ స్వర్గం చేర్చిందే! పదమూడేళ్లపిల్ల! అర్భకురాలు! లోకం తెలియనిది! ఎంత ఓర్పు! ఎంతనిదానం! ఇంతా ఇందుకా? ఆహా! పరమేశ్వరా!

తనకు భగవంతుడిలోగూడా నమ్మకం పుట్టించిందే మణి! భగవంతుడు కాకపోతే తన కటువంటి భార్య నెవరిస్తారు? భగవంతుడుంటే ఇట్లా ఎందుకు జరుగుతుంది? మనుష్యులే చెయ్యరే, భగవంతు డిచ్చి పుచ్చుకుంటాడా?

ఒక్కసారిగా లోపలివాళ్లంతా గొల్లుమన్నారు. అయిపోయింది. మణి అస్తమిం

చింది. ఇక లోకం పాడే! ఆచంద్రుడు తన్ను చూసి నవ్వుతున్నాడు. అనుకున్న ప్రకారం తనగుండె బద్దలైపోలేదు.

అయినా తనకు మణితో ఏంపని? తనెక్కడ, మణి యెక్కడ? కాంతారావుకు తనేం చేస్తున్నదీ తెలేదు. అతను బయటికొచ్చాడు. వాకిట్లో డాక్టరుకారు నిర్జీవంగా నిలిచిఉంది. డ్రైవరు కారులోపల అస్పష్టమైన ఆకారంతో కూచుని "అయిపోయిందా?" అన్నాడు. కాంతారావు విననివాడల్లే నిర్మానుష్యంగా ఉన్న వీధివెంటబడి పిచ్చివాడల్లే నడవటం మొదలుపెట్టాడు.

౨

ఉదయం ఏడూ ఏడున్నరప్పుడు నాళం వారి సత్రంముందు ఒక దయ్యం తారట్లాడుతున్నది. ఆవ్యక్తి కింకోపేరు కుదరక దయ్యమనవలసి వచ్చింది. మొహాన ఒక నెత్తురు చుక్క ఉన్నట్టు లేదు. కళ్లల్లో జీవం ఎంతమాత్రమూ లేదు. మనిషి సన్నగా, పొడుగ్గా, నాజూకుగానే ఉన్నాడు. గుడ్డలు చాలా మాసిఉన్నై. మొహాన ఏభావమూ కనపడలేదు. వెంకట్రావు సత్రంలోనించి ఎదురుగా ఉన్న హోటలుకు పోతూ చూశాడా దయ్యాన్ని. అతను కాఫీ తాగి వస్తుండగా ఇంకా ఆదయ్యం తారట్లాడుతునే ఉంది. ఈ సారి వెంకట్రావు వెనక్కు తియ్యకుండా ఆ వ్యక్తిని సమీపించి "ఎవరు మీరు?" అన్నాడు.

"నన్నేమీ అడక్కండి. నేను —నేనేమీ చెప్పేస్థితిలో లేను!" అన్నాడు కాంతారావు మొహాన బాధసూచిస్తూ.

"సత్రంలో బస చేస్తారా?" అన్నాడు వెంకట్రావు.

కాంతారావు చేస్తానన్నట్టు తల ఊపాడు. వెంకట్రావు రమ్మని సత్రంలోకి దారితీశాడు.

గుమాస్తాగారు సత్రంలో బస చేసిన వారికి పాత్రసామగ్రీ అవీ చూసిపెడుతున్నాడు. వెంకట్రావు గుమాస్తాగారి గదిలోకి వెళ్లి "ఏమండీ గుమాస్తాగారూ, వీరికి గది ఒకటి ఇప్పించగలరా?" అన్నాడు.

"వారిపేరు?" అన్నాడు గుమాస్తా తలఎత్తకుండానే.

వెంకట్రావు ఒకసారి కాంతారావువంక చూసి "సుబ్బారావుగారు. గుంటూరుసుబ్బారావుగారు" అన్నాడు తడుముకోకుండా.

గుమాస్తా తలమెత్తి "గదులు ఖాళీలేనట్టుందే!" అన్నాడు పరధ్యానంగా.

"రెండోమూడో ఖాళీగానే ఉన్నట్టున్నదే!" అన్నాడు వెంకట్రావు. "నాటకం సమాజంవా రెవరో మాట్లాడుకున్నా" రని చెప్పాడు గుమాస్తా.

"పోనీ, నా గదిలోనే ఉండరాదూ మీరు?" అన్నాడు వెంకట్రావు కాంతారావువంక తిరిగి. కాంతారావు ఉంటానని

తల ఊపాడు. ఆభాషకూడా అతనికి చాలా బాధకరంగా ఉన్నట్టుంది.

### 3

వెంకట్రావు సరదామనిషి. అతనికి ప్రపంచం యావత్తూ ఆనందమయంగా ఉండాలి. తనచేత సుబ్బారావని నామకరణం చెయ్యబడ్డ కాంతారావు ఆవిధంగా ఘోస్టల్లే ఉండటం అతనికేమీ నచ్చలేదు. అతన్ని నవ్విద్దామని అనేక హాస్యాలు చెప్పాడు. భమిడిపాటి కామేశ్వరరావు పోట్లు కూడా ఏమీపనిచెయ్యలేదు. అతను నవ్వలేదు సరే కదా, వినిపించుకుంటున్నట్టు కూడా లేదు. ఒక్కొక్క ప్రయత్నమూ వ్యర్థమౌతున్న కొద్దీ ఈమనిషిని రెచ్చగొట్టి మనిషిలోకి జీవం తీసుకురావాలని వెంకట్రావు తీర్మానం జాస్తికాసాగింది.

రంకు పురాణంలోకి దిగితే ఎట్లా ఉంటుందో ?

"గాలివానవచ్చిన సంవత్సరంలోనండీ! నే నప్పుడు మచిలీబందరులో ఉంటుండగానండి, నాకు మణి అని ఒకపిల్లతో స్నేహమైంది. పిల్ల చాలా బాగుండేది సుమండి. మొగుడు వెధవ ఉత్తధనాసరి పీనుగని చెప్పకునేవారు. వాడెప్పుడూ ముండలవెంట తిరిగేవాడుట. సరిగా రెండు నెల్లు. ఇంతలో నేను ఆవూర్నుంచి వెళ్లిపోవలిసొచ్చింది. నేను వెళ్లిపోతుంటే ఆపిల్ల ఎంత ఏడిచిం దనుకున్నారు. మనం బాధ్యత నెత్తిమీద వేసుకుని పెళ్లిళ్లు చేస్తామే గానండి, అసలు పెళ్లిళ్లు—"

వెంకట్రావుగారి సుబ్బారావు విచిత్రంగా ప్రవర్తించటం మొదలుపెట్టాడు. అతని మొహం ముందర ఎర్రగా అయింది. తరవాత అతనికళ్లు చలించటం మొదలు పెట్టినై జీవంతో. చివర కతను దెబ్బ తిన్నవాడల్లే చివాలున లేచి వెంకట్రావువంక ఒక్కక్షణం తీవ్రంగా చూసి చరచరా బయటికి వెళ్లాడు.

వెంకట్రావు, పాపం, నిర్ఘాంతపోయినాడు. అతనికేమీ అర్థంకాలేదు. అతను బయటికొచ్చాడు. సుబ్బారావు లేడు. గబగబా వీథిలోకి వెళ్లి చూశాడు. సుబ్బారావు ఎక్కడా కనిపించలేదు.......

స్టేషనుకు పోయేదారిలో ఒక పెద్దమనిషికి వెనకనించి వచ్చి ఏదో బలంగా టాకీయిచ్చింది. ఆయన వెనక్కు తిరిగి చూస్తే సన్నటి పొడుగాటిమనిషి కనపడ్డాడు. ఇంకా ఏదోక్షమాపణ వస్తుందని చూస్తున్నాడా పెద్దమనిషి. ఏదో గాలివానవిషయం గొణుక్కుంటూ ఆసన్నటిమనిషి ఏమీ జరగనట్టే సాగిపోయినాడు. ఆవిధంగానే స్టేషనులో టిక్కెట్టుసరిచూస్తున్న మనిషికూడా టిక్కెట్లు సరిచూస్తూ ఈసన్నని పొడుగాటి మనిషినే టిక్కెట్టు చూపించమని అడిగి టిక్కెట్టుకు బదులు గాలివానవిషయం ఏదో వినపడీ వినపడకుండా తెలుసుకున్నాడు......

కాంతారావు నిర్మానుష్యమైన బజారు వెంట చరచరా నడుస్తూ తన ఇంటికి కొద్ది దూరంలో అకస్మాత్తుగా ఆగాడు.

"గాలివాన వచ్చిన సంవత్సరం! పందొమ్మిదివందల ఇరవైఅయిదు! మణి ఏడేళ్లద!"

అతని శరీరం ఒక్కసారి బిగుసుకు పోయింది. కాలు కదల్లేదు. ఎంతసే పట్లా నిల బడి ఉన్నాడో తెలేదు!

"కాంతం!"

కాంతారావుశరీరం జల్లుమంది.ఆగొంతు తన నాయనమ్మది. ఉత్తరక్షణంలో ఆవిడే కనిపించింది. ఆవిడచేతులో మందుసీసా! ఇంకెవరికి మందు?

"ఇదేమిట్రా కాంతం? ఎక్కడి కెళ్లావు! పాపం, అది ఒళ్లు తెలిసినప్పటినించీ నీకోసం ఒకటే కలవరిస్తున్నదిగదా!"

"ఎవరు?" ఆమాట అడిగేటప్పుడు కాంతం గొంతు వణికింది, గాలికి ఆకల్లే.

"నీపెళ్లాం!"

అతనికళ్ల వెంబడి నీళ్లు గిర్రున తిరిగినై. అది ఆనందమో, దుఃఖమో, లేక రెండూనో కాని అది భరించటాని కసాధ్యంగా ఉంది. మైకం కమ్ముతుందేమో నన్నట్టు కాంతారావు గట్టిగా తొడగిల్లుకున్నాడు. వావిలాల వారి పెరట్లో చెట్లమీద చంద్రు డుదయిస్తు న్నాడు. "పోరా, పాపం, మేలుకునే ఉంది. దాని కన్నపడు! కుర్రనాగమ్మా!" అంటు న్నది. నాయనమ్మ వెనకనించి. అతని కళ్లు పిండినబట్టల్లే నీళ్లోడుతునై.

చంద్రోదయాన్ని వదిలిపెట్టి పారిపోయిన వాడికి లేం దీచంద్రోదయాని కెదురు పరిగెత్తేవాడి కెందు కీదుఃఖం?

---

## పోతనకవి

చిలుకూరి నారాయణరావు

'రామచంద్రసాక్షాత్కారరమ్యహృదయ
జనిత భవ్యభావోత్ఫుల్లసరసవచన
గుంఫితాశ్లేషకవితా నిగూఢభక్తి
పరవశా! పోతనా! నీకువందనంబు.'

కొందరికి తెనుగే గుణంబగు
కొందరికి సంస్కృతము గుణమగు
కొందరికి నుభయంబు గుణమగు
నంచు మదినెంచి,

అందరికి నందంబు హృదయా
నందమును చందంబు వీనుల
విందుగా గానంబునేసిన
కవికి వందనము.

పలుకునది భాగవతమంచును
పలుకజేసెడివాడు రాముడు
పలికినను భవహరమటంచును
పలికితివి సుకవీ!